అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మహిళలకు సబ్సిడీ గ్యాస్ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయలయ్య

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 20 : ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాలకు చెందిన 108 మంది లబ్ధిదారులకు యాదగిరిగుట్ట పట్టణంలో కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్లు కళ్లెపల్లి శ్రీశైలం, పుష్పాల నర్సింహులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్, భాస్కర్, భిక్షపతి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు రూ.25వేల విరాళం

ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతల విరాళాలు కొనసాగుతున్నాయి. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన హయశ్రీ యాడ్స్ ప్రొప్రైటర్ నల్లన్‌ధీఘళ్ ధర్మప్రణీత్ రూ.25వేల విరాళం అందజేశారు. సంబంధిత చెక్కును శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అందించారు. ఇటీవల కురిసిన వర్షానికి తీవ్రంగా నష్టపోయిన బాధితులకు అండగా నిలిచేందుకు సాయం చేసినట్లు ధర్మప్రణీత్ తెలిపారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం, జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు భువనగిరి, తుర్కపల్లి, మోటకొండూరు, మోత్కూరు మండలాల్లో శుక్రవారం పర్యటించి చిరుసంచుల పంటలు, అధిక సాంద్రత పత్తి సాగు, ప్రదర్శనా క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావం వల్ల ఆలస్యంగా నాట్లు వేసిన వరి పొలాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనల ప్రకారం ఎరువులు, కలుపు యాజమాన్యం చేపట్టాలని సూచించారు. చీడపీడలను వెంటనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే తక్కువ ఖర్చుతో పంటను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు బి.అనిల్‌కుమార్, కె.మమత, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి, వీరవెల్లి గ్రామ అభ్యుదయ రైతులు కంచి మల్లయ్య, కంచి లలిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 20 : పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ అన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎం విశ్వకర్మ పథకంతో మహిళలు జీవనోపాధి పొందవచ్చన్నారు. పథకం డబ్బులతో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పీఎం విశ్వకర్మ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ స్టేట్ కో ఆర్డినేటర్ శైలజ, కెనరా బ్యాంక్, ఏపీజీవీబీ అధికారులు పాల్గొన్నారు

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

వలిగొండ, సెప్టెంబర్ 20 : జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో కళ్లెం సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు తీసుకురావడం వల్ల దేశంలో ఫెడరల్ విధానానికి విఘాతం కలుగుతుందన్నారు. దీంతో ఐదు సంవత్సరాలు ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు రెండు, మూడేండ్లు మాత్రమే అధికారంలో ఉంటాయని, రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. జమిలీ ఎన్నికల పేరుతో రాజ్యాంగంలోని 83, 172 ఆర్టికల్స్‌ను సవరించడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. జమిలీ ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన జమిలీ ఎన్నికలను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, నాయకులు మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, యాదయ్య, చంద్రయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం అందజేస్తున్న ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమార్

మోత్కూరు, సెప్టెంబర్ 20 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు నష్టం చేకూర్చే విధంగా జాతీయ విద్యా విధానం ఉందన్నారు. విద్యారంగంలో తీసుకొస్తున్న సంస్కరణలను ఉపసంహరించుకోవాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపాక చందు, నాయకులు వినయ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

భువనగిరిలో విరాళాలు సేకరిస్తున్న కళాకారులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 20 : వరద బాధితులకు అండగా కళాకారులు శుక్రవారం భువనగిరి పట్టణంలో విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి సేకరించిన విరాళాలను ప్రభుత్వానికి అప్పగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు కొమ్మనబోయిన మహేశ్, తిరుమలేశ్, మహేశ్, ప్రవీణ్, జాన్‌రెడ్డి, లింగయ్య, నర్సింహ, విష్ణు, సత్తయ్య, శ్రీనివాస్, యాదగిరి, బాలమణి పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు

బీబీనగర్, సెప్టెంబర్ 20 : మండలంలోని మగ్దుంపల్లి, గొల్లగూడెం, ఎర్రబెట్టె తండాలో బునాదిగాని కాల్వ ద్వారా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో శుక్రవారం ఎర్రకుంట వద్ద ఇటాచీతో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. స్థానిక నాయకులు సత్తిరెడ్డి, శ్యామ్ గౌడ్, పింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలకృష్ణగౌడ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ హోమం

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూత పేత పిశాచాల బాధలు తొలగి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతును నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. సాయంత్రం ప్రధానాయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలకంరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యపూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.13,42,641 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నేడు గుట్టకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుమిదిని శనివారం రానున్నారు. ఉదయం కొండపైకి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గం గుండా హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు.

గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

ఆలేరు ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రామన్నపేట ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 20 : గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు చింతకింది రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు, విద్యుత్ దీపాల బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు గణగాని శశికాంత్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు సర్వర్‌నాయక్, ఇందిర, తిరుమలాచారి, కనకరాజు, శ్రీలత, సాయిలు, మీనా పాల్గొన్నారు.

నిధులు లేక నిర్వహణ చేయలేకపోతున్నాం

రామన్నపేట : గ్రామ పంచాయతీల్లో నిధులు లేక నిర్వహణ చేయలేక ప్రజల ఒత్తిడికి గురవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ యాకూబ్‌నాయక్‌కు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎండీ ఖదీర్, బి.చంద్రశేఖర్, రసూల్, స్వరూప, జ్యోతి, పవన్, వేణు, ఉపేందర్, అయ్యప్పరెడ్డి, రమాదేవి, సుధ, శిరీష, వెంకటేశ్, విఠల్, పావని, సుమన్, కవిత, ఉమాశంకర్, మహేశ్, వేణు, లక్ష్మీనర్సయ్య, మోహన్ పాల్గొన్నారు.

10 నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

చౌటుప్పల్, సెప్టెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వంపై 10 నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో శుక్రవారం ఇంటింటికీ బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలే తమ పార్టీని గెలుపిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు భిక్షంగౌడ్, శంకర్, వేణు, అశోక్‌గౌడ్, కొండల్ పాల్గొన్నారు.

సోమన్న కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 20 : మండలంలోని పల్లెపహాడ్ మాజీ ఉప సర్పంచ్ సుగురి సోమన్న గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సోమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఇంద్రారెడ్డి, భిక్షపతి, వెంకటేశ్, మల్లేశ్, పరశురాములు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామన్నపేట, సెప్టెంబర్ 20 : మండలంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు ఆటోను అనుసరించగా రైస్ మిల్లు వద్ద ఆగింది. ఆటోను తనిఖీ చేయగా ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. అనుమానంతో అధికారులు మిల్లులో తనిఖీ చేయగా 85 క్వింటాళ్ల బియ్యం దొరికింది. బియ్యం, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తాసీల్దార్ బాలమణి తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న 11మంది అరెస్ట్

వలిగొండ, సెప్టెంబర్ 20 : మండలంలోని నర్సాయిగూడెంలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వి.యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ పేకాట ఆడుతున్న కేశబోయిన వెంకటేశ్, కోత వేణుగోపాల్, బుంగ లక్ష్మయ్య, వంగాల నాగార్జున, రవ నర్సింహా, వంగాల అరవింద్, కూరెళ్ల శ్రీను, వడ్లకొండ మల్లేశ్, అంబటి సాయి, రాచకొండ పాండు, వెంకట్‌రెడ్డిని అరెస్ట్ చేశారు.

బంగారు గొలుసు అపహరణ

చౌటుప్పల్, సెప్టెంబర్ 20 : గుర్తు తెలియని దుండగులు ఓ వ్యక్తిని కొట్టి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ సంఘటన చౌటుప్పల్ పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురం తండాకు చెందిన తేజావత్ కల్యాణ్ చౌటుప్పల్‌లో నివాసముంటూ ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఇండోర్ స్టేడియం వద్ద గురువారం రాత్రి తన స్నేహితురాలితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి మీరు ఇక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. అతడిని కొట్టి మెడలో ఉన్న 1.6తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గంటల ప్రాతిపాదికన బోధించుటకు దరఖాస్తులు

గుండాల : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 9, 10, ఇంటర్ విద్యార్థులకు గంటల ప్రాతిపాదికన బోధించుటకు అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.రాము శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 23లోగా పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా గణేశ్ శోభాయాత్ర

భువనగిరి కలెక్టరేట్ : గణనాతుడికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 20 : పట్టణంలో 101 యూత్ అసోసియేషన్, పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల శోభాయాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి పూజలు చేశారు. స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయం ఎదుట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో 2,22,222 రూపాయలకు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ దక్కించుకున్నారు. 101 రూపాయలు చెల్లించి టికెట్ పొందిన సభ్యులకు మెగా లక్కీ డ్రా నిర్వహించగా.. మైల మధు యమహా స్కూటీని గెలుచుకున్నారు. పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక లడ్డూను రూ.70 వేలకు సురపల్లి శ్రీను దక్కించుకున్నారు. కార్యక్రమంలో 101 యూత్ అధ్యక్షుడు వంగూరి బాలకృష్ణ, గౌరవాధ్యక్షుడు చేరాల సుధీర్, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగంధర్, గౌరవాధ్యక్షుడు సురపల్లి రాము పాల్గొన్నారు. యువజన జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. శనివారం గణేశ్ శోభాయాత్ర, మార్కండేశ్వర ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, లడ్డూ వేలం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూజల్లో బీఆర్ఎస్ నేత చింతల

భువనగిరి కలెక్టరేట్ : మండలలోనిం అనంతరం గ్రామంలో బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం పూజలు చేశారు. అనంతరం వినాయక శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గణపతిని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చింతల వెంకట్‌రెడ్డి, నాయకులు సురేశ్, విజయ్, యూత్ అసోసియేషన్ సభ్యులు బాలరాజు, శ్రీనివాస్ శర్మ, మురళి, సుధ, అఖిల్ ఉన్నారు.

పోచంపల్లి : గణేశ్ శోభాయాత్రలో 101 యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 20 : అర్హత కలిగిన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 50 శాతానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఇంకా రూ.14వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నదని తెలిపారు. తక్షణమే ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రైతుబంధు కింద పంట పెట్టుబడి సాయం అందిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం పంట కోత దశకు వచ్చినా ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి వెంటనే రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కోట రామచంద్రారెడ్డి, మధు, విష్ణు, బుచ్చిరెడ్డి, జ్యోతి, కృష్ణారెడ్డి, భిక్షపతి, లాలయ్య పాల్గొన్నారు.

'తెలుగు యూనివర్సిటీ పేరు మార్పును విరమించుకోవాలి'

భువనగిరి కలెక్టరేట్ : అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరు మార్పును విరమించుకోవాలని ఆర్యవైశ్య మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు పసుపునూరి నాగభూషణం, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఆకుల రమేశ్, జోన్ చైర్మన్ చీకటిమల్ల రాములు, మహేందర్ గుప్తా, మహేశ్, మనోహర్, రవి, వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు యోచనను వ్యతిరేకిస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసునూరి వీరేశం, అయిత వెంకటేశ్, ప్రకాశ్, అంజయ్య, ఉపేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

- ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 20 : క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఎస్జీఎఫ్ పాఠశాలల క్రీడల్లో భాగంగా శుక్రవారం క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రీడలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొంది పాఠశాల ఖ్యాతిని చాటాలని సూచించారు. ఎంఈఓ జంగిటి కృష్ణ, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎస్ఐ రజనీకర్, ఎస్టీఓ కట్ట శ్రీనివాస్, బాలకృష్ణ, బహుమతుల దాత బండిరాజుల శంకర్, బీఆర్ఎస్ నాయకులు మొరిగాడి వెంకటేశ్, లక్ష్మి, మంజుల, నాగయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్, వైద్యాధికారి వంశీకృష్ణ

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 20 : సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ రాములునాయక్, మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. ఫ్రై డే డ్రైడే, కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధులను పరిశీలించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఏఎన్ఎం మమత, ఆశ కార్యకర్తలు షాహిన్, భాగ్యమ్మ, శిరీష, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛ కార్యక్రమం

కళాశాలలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 20 : పరిస